
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 14 ఏప్రిల్ 2025

● గుంటూరు ఏటి అగ్రహారం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తి చేసి సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబం . దాలు చూస్తున్నా ఇప్పటికీ కుదరలేదు.

నాకొక శ్రీమతి కావాలి

పెళ్లెప్పుడవుతుంది బాబూ.. నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు.. దశాబ్దాల క్రితం రాసిన ఈ సినిమా పాట ప్రస్తుత పరిస్థితులకు అతికినట్టు సరిపోతుంది. పెళ్లి రెండు జీవితాలను ముడివేసే బంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి ఒక్కరి జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. అయితే మూడు ముళ్లతో ఏకం కావాలని కోరుకునే ఎంతోమంది అబ్బాయిలకు ఈ మధ్య కాలంలో పిల్ల దొరకడం లేదు. ఒకటి రెండు కాదు మెజార్టీ సామాజిక వర్గాల్లో అమ్మాయిల కొరత వేధిస్తుంది.

- పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు
- మెజార్టీ కమ్యూనిటీల్లో అమ్మాయిల కొరత
- మారుతున్న యువతుల అభిరుచులు
- కష్టమవుతున్న పెండ్లి సంబంధాలు
- వివాహ పరిచయ వేదికలకు పెరుగుతున్న క్యూ
- అబ్బాయిల తల్లిదండ్రుల్లో ఆందోళన
- కొన్ని ప్రాంతాల్లో అమలవుతున్న కన్యాశుల్కం





మారుతున్న అమ్మాయిల అభిరుచులు..


ఇటీవలి కాలంలో యువతుల అభిరుచులూ మారుతున్నాయి. గతంలో అమ్మాయి తరపు వారికి అబ్బాయి నచ్చితే సరిపోయేది. కాని, ఇప్పుడు అమ్మాయిలకు నచ్చితేనే పెళ్లికి ముందుకు వెళ్తున్నారు. అబ్బాయి వయస్సు, సంపాదన, కుటుంబ నేపథ్యం, ఆస్తులు ఇలా అన్ని చూసుకున్న తర్వాతనే ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా పెద్ద కుటుంబాలను కోరుకునేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లి కాగానే వేరు కాపురం పెడుతారా..? లేదా..? అన్న కోణంలోనే అమ్మాయిలు చూస్తున్నారు. తమ పిల్లలకు కష్టం వాటిల్లకుండా ఉండాలన్న తపనను తల్లిదండ్రులు ప్రదర్శిస్తున్నారు.

గుంటూరు, సంగడిగుంటకు చెందిన ఓ యువకుడు ఎనిమిదేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.60 వేలకుపైగానే జీతం వస్తోంది. మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన యువ కుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో రూ.80 వేలతో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. అయినా మూడేళ్లుగా పెళ్లి సెట్ కాలేదు.

డొకిపర్రు గ్రామానికి చెందిన ఓ యువకుడు బేల్దారు మేస్త్రిగా ఉంటూ నెలకు రూ.50 వేలకు పైగా సంపాదిస్తున్నాడు. గ్రామాల్లో పొలం, ఇతర ఆస్తులు ఉన్నాయి. ఐదేళ్ల నుంచి పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నా సంబంధం కుదరలేదు.

రూరల్ మండలం, ఓ గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన యువ రైతుకు పెళ్లి కావడంలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు విజయనగరం జిల్లాకు వెళ్లి ఎదురు రెండు లక్షలు ఇచ్చి ఓ బలహీన వర్గానికి చెందిన యువతితో వివాహం చేశారు.



గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని యువకుల పరిస్థితి. చదువు, జీతం, ఆస్తులు, హోదా ఉన్నా పెళ్లిళ్లు కుదరడంలేదు. మూడు పదుల వయసు దాటుతున్నా పెళ్లి కాని వారి సంఖ్య ప్రస్తుతం అన్ని సామాజిక వర్గాల్లో తీవ్రమవుతోంది. గతంలో ఆడపిల్ల ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటి అనుకునేవారు. కట్నకానుకలు ఇవ్వడానికి అప్పు చేసేవారు. ఇప్పుడు ఇదంతా పూర్తిగా మారింది. కట్నం మాట దేవుడెరుగు, అమ్మాయి వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంటే చాలన్నట్లుగా అబ్బాయిలు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

● పరిచయ వేదికలకు అబ్బాయిల క్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ సామాజిక వర్గంలో అమ్మాయిలు కొరత అధికంగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని.. ఆ సంఘం పెద్దలు ఓ ఆలోచన చేసి.. వధూవరుల వివరాల సేకరణకు సంఘం ఆధ్వర్యంలో ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. అయితే గడిచిన ఎనిమిది నెలల్లో 2140 మంది అబ్బాయిలు, 830 మంది అమ్మాయిలు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో సదరు సంఘం ఇప్పటికి మూడుసార్లు పరిచయ వేదికలు నిర్వహిస్తే.. ఇద్దరూ ఒక్కటైంది కేవలం 79 మంది మాత్రమే. ఈ తరహా పరిచయ వేదికలకు అబ్బాయిలు క్యూ కడుతున్నారే తప్ప.. అమ్మాయిల సంఖ్య నానాటికి తగ్గుతుంది. గుంటూరులో ఇటీవల ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయగా 70 శాతం అబ్బాయిలు వస్తే.. 30 శాతం అమ్మాయిలు వచ్చారు.

● మానసిక సమస్యలు..

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగి పోతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. పెళ్లెప్పుడు అని పలువురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తీవ్రమైన ఒత్తిడిని అనుభవిస్తున్నారు.

● నిర్దిష్ట అభిప్రాయాలు లేని తల్లిదండ్రులు

పెళ్లిళ్లు ఆలస్యమవ్వడానికి అబ్బాయిలు, అమ్మాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి మరో కారణంగా చెప్పవచ్చు. మంచి కట్న కానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తర్వాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కట్నంతోపాటు బంగారం, భూములు ఇవ్వాలన్న షరతులను అమ్మాయిల తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. మరోవైపు అబ్బాయికి ఆస్తి, లక్షల జీతం ఉండాలని అమ్మాయిల తల్లి దండ్రులు ఆశిస్తున్నారు.

రైతులకు, కులవృత్తుదారులకు పిల్లను ఇవ్వం

రైతులకు, కులవృత్తులు చేసుకునే వారికి పిల్లనిచ్చేందుకు ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ఉద్యోగాలు చేసే వారి కంటే ఎక్కువ సంపాదన, ఆస్తులు ఉన్నప్పటికీ పిల్లనివ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన వారికి 20 ఎకరాల పొలం ఉన్నప్పటికీ పెళ్లి కావడం లేదు. ప్రతి గ్రామంలో 30 నుంచి 50 మంది వరకు పెళ్లి కాకుండా ఉంటున్నారని ఈ మధ్య నిర్వహించిన సర్వేలో తేలింది. దీంతో అబ్బాయిలు తల్లిదండ్రులు వేరే జిల్లాలకు వెళ్లి ఇతర కులాలకు చెందిన అమ్మాయిలను తెచ్చి పెళ్లి చేస్తున్నారు.

అందుబాటులో వీకెండ్ మ్యారేజ్

ఇప్పటివరకు సహజీవనంతో కాలంగడుపుతున్న యువత జీవితాల్లో వీకెండ్ మ్యారేజ్ అనే కాన్సెప్ట్ వైపు వెళుతున్నారు. పెళ్లి చేసుకున్నా, ఇబ్బందులు పడకుండా ఉండేలా వీకెండ్ మ్యారేజెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరూ అందరిలాగానే పెళ్లి చేసుకుంటారు. అయితే ఇద్దరూ వారంతంలో మాత్రమే కలిసి ఉంటారు. మిగతా రోజుల్లో ఎవరి జీవితం వారు స్వేచ్ఛగా గడుపుతారు. ఈ పద్ధతిలో ఎవరి ఉద్యోగం, ఎవరి ఖర్చులు వారివే. వారాంతంలో మాత్రం కలిసి ఖర్చులు పంచుకుని ఎంజాయ్ చేస్తారు. పిల్లలు పుడితే ఖర్చులు సగం సగం పెట్టుకుంటారు. వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే కలిసి ఉంటారు కాబట్టి, విభేదాలు, గొడవలు ఉండవనే భావనతో ఈ పద్ధతి వైపు వెళ్తున్నారు. ప్రస్తుతం ఈ సంప్రదాయం హైదరాబాద్‌లో ఈ మధ్యనే మొదలైంది.

కష్టతరంగా మార్చేశారు..



గతంలో సులువుగా ఉండే పెళ్లి ప్రక్రియను నేటి తల్లిదండ్రులు, యువత క్లిష్టతరం చేశారు. ఆధునిక జీవనశైలి, వ్యక్తిగత అభిరుచులు, భిన్నమైన ఆర్థిక స్థితిగతులు, కుటుంబాల ఆశలు ఇవన్నీ కలిసి వచ్చి పెళ్లి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారు ఏ రంగంలో స్థిరపడినా ఆలస్యం చేయకుండా పెళ్లి చేస్తే ఎలాంటి సమస్యలు రావు. తల్లిదండ్రులు, పెద్దలు కలిసి వధూవరులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.

- మాధవ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు.



● అమ్మాయిలు కొరత అత్యధికం..




అన్ని సామాజికవర్గాల్లో అమ్మాయిల కొరత అత్యధికంగా ఉంది. సంబంధాలు దొరకడం కష్టమవుతున్నది. మా మ్యారేజ్ బ్యూరో తరపున అనేకసార్లు వివాహ పరిచయ వేదికలు ఏర్పా టు చేసినా 112 మంది అబ్బాయిలు, 26 మంది అమ్మాయిలు మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నారు. భవిష్యత్‌ను తలుచుకుంటేనే భయం వేస్తోంది.

- ఎమ్ వరలక్ష్మి, వరలక్ష్మీ మ్యారేజ్ బ్యూరో, పాతగుంటూరు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు సిద్ధం

● నేడు పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు



సిద్ధమైన ప్రజా వేదిక

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ బార్గవ్‌తేజ, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలంలోని పొన్నెకల్లు సిద్ధమైంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదివారం ఉదయం నుంచి పొన్నెకల్లులోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.





సీఎం పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలోని ఇంటి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10:40 గంటలకు పొన్నెకల్లు చేరుకుంటారు. 10.40 నుంచి 11.05 నిమిషాల వరకు ప్రజలు, అధికారులతో మాట్లాడతారు. 11:05 నుంచి 11:10 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. 11:10 నుంచి 11:50 గంటల వరకు పొన్నెకల్లులోని అంబేద్కర్ కాలనీలోని ఇళ్లను సందర్శిస్తారు. అనంతరం 12.05 గంటలకు ప్రజావేదిక సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 12:05 నుంచి 2:05 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 2.30 గంటల వరకు భోజన విరామం తీసుకుంటారు. 2.40 నుంచి 4.10 గంటల వరకు పార్టీ క్యాడెర్‌తో సమావేశం అవుతారు. 4:20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఉండవల్లిలోని ఇంటికి వెళతారు.

పండుగలా ఇళ్ల పట్టాల పంపిణీ

● విజయవంతంగా పూర్తయిన తొలి విడత ● ఐదు రోజులపాటు మన ఇల్లు-మన లోకేశ్ ● 3,005 మందికి నూతన వస్త్రాలతో పట్టాలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నో దశాబ్దాలుగా నెలకొన్న మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లోని వివిధ ప్రభుత్వ భూముల్లో నివాసం వుంటున్న సుమారు మూడు వేల మందికి తొలి విడతలో శాశ్వత ఇంటి పట్టాలను అందజేసి ఆయా కుటుంబాల్లో సంతోషం నింపారు. ఈ నెల 3వ తేదీన ఉండవల్లి రజకుల కాలనీకి చెందిన రాజమండ్రి ఓవిందు కుటుంబానికి మంత్రి లోకేశ్ తొలి పట్టాను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం మంగళగిరి డాన్‌బోస్కో పాఠశాల పక్కన గల మైదానంలో ఐదు రోజులపాటు మన ఇల్లు-మన లోకేశ్ పేరిట పేదలకు తొలి విడత ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమం ఆదివారంతో దిగ్విజయంగా ముగిసింది. లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలు పెట్టి మరీ స్వయంగా మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరికీ పట్టాలు అందజేయడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఐదు రోజుల కార్యక్రమంలో రత్నాలచెరువులో 729, మహానాడు-1లో 473, మహానాడు-2లో 441,ఎర్రబాలెంలో 274, కొలనుకొండలో 235, పెనుమాకలో 185, పద్మశాలి బజార్‌లో 137, డ్రైవర్స్ కాలనీలో 119, నీరుకొండలో 99, సలాం సెంటర్‌లో 92, ఉండవల్లిలో 82, ఉండవల్లి సెంటరులో 85, సీతానగరంలో 48, ఇప్ప టంలో పది మందికి కలిపి మొత్తం 3.005 మంది మంత్రి చేతుల మీదుగా పట్టాలను అందుకున్నారు.



పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్

తెనాలిలో.. వడగళ్ల వాన



గుంటూరు యార్డులో మిర్చి టిక్కీలపై పట్టాలు కప్పుకున్న రైతులు

- విరిగిపడిన చెట్లు, విద్యుత్తు స్థంబాలు
- రోడ్లన్నీ వడగళ్లతో జలమయం
- గుంటూరులో గాలి దుమారం
- విరిగిపడ్డ చెట్ల కొమ్మలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి, గుంటూరు ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి): వాన చినుకులు కాదు.. ఢమ..ఢమా అంటూ మంచు గడ్డల్లాంటి వడగళ్లు కుమ్మరించేశాయి. అప్పటి వరకు ఎండ వేడి ఠారెత్తిస్తే, సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఆకాశమంతా మేఘాలు కమ్మేసి క్షణాల్లోనే ఈదురు గాలులతో కూడిన వర్షం మొదలయింది. తెనాలి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం, బాపట్ల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం భారీగానే పడింది. మరికొన్ని ప్రాంతాల్లో వర్షం లేకున్నా, పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. తెనాలి ప్రాంతంలో వర్షం మొదట చినుకులతో మొదలయినా, పది నిముషాల తర్వాత నుంచి వడగళ్లు పడటం వింతగాను, కొన్నిచోట్ల భయాన్ని కలిగించాయి. పెనుగాలులు ప్రతాపం చూపటంతో చెట్లు, విద్యుత్తు స్థంబాలు విరిగిపడ్డాయి. చెట్లు, కొమ్మలు తీగెలపైనా, ఇళ్లపైనా పడటంతో కొన్నిచోట్ల పాక్షికంగా నష్టం ఏర్పడింది. అంగలకుదురు, పెదరావూరు, సంగంజాగర్లమూడి, మరికొన్ని గ్రామాల్లో విధ్వంశమే జరిగినట్టయింది. విద్యుత్తు స్థంబాలు విరిగిపడటం, తీగలపై చెట్లు, కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటన్నర తర్వాత వాతావరణం శాంతించటంతో విద్యుత్తు శాఖ సిబ్బంది విద్యుత్తు సరఫరాను పునరుద్దరించే పని చేపట్టారు. దీంతో ఆదివారం అర్ధ రాత్రి వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా లేక అంధకారంలోనే గ్రామాలున్నాయి.

పంటలకు తీరని నష్టం

అకాల వర్షంతో మొక్కజొన్న, జొన్న, పెసర పంటను చేలల్లోనే ఆరబెట్టుకున్న రైతులకు పెద్ద నష్టమే జరిగింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, వర్షం కుమ్మరించేయటంతో ఊర్లకు దగ్గర్లో ఉన్న రైతులు పరుగులు పెట్టుకుంటూ వెళ్లి పట్టాలు తెచ్చుకుని పంటలను తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేశారు. పొలాలు దూరం ఉన్నవారికి మాత్రం సాధ్యంకాకపోవటంతో మొక్కజొన్న, జొన్న, పెసర పంటలు తడిచిపోయాయి. తెనాలి, దుగ్గిరాల, అమృతలూరు, చుండూరు, వేమూరు, మరికొన్ని మండలాల పరిధిలో పంటలు వర్షానికి తడిచిపోయాయి. కోతకోయకుండా ఉన్న మొక్కజొన్నకు పెద్దగా నష్టం లేకున్నా, పెసర, జొన్నకు మాత్రం కొంత నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో పెనుగాలుల ప్రతాపానికి అరటి, తమలపాకు, బొప్పాయి వంటి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

గాలి దుమారం మిర్చి రైతులను భయ పెట్టించింది. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి పలు దఫాలుగా గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పెనుగాలలు వీచాయి. మిర్చియార్డులో మిర్చి బస్తాలు ఎక్కడ తడిచి పోతాయోనని రైతులు ఆందోళన చెందారు. టార్పాలిన్ పట్టాల కోసం పరుగులు పెట్టారు. మరోవైపు పెనుగాలులకు గుంటూరులో పలుచోట్ల విద్యుత్ తీగెలు తెగిపడటం, చెట్లకొమ్మలు విరిగిపో వడం, హోర్డింగ్‌లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం వాటిల్లింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా నగరంలోని పలు ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఆదివారం సాయంత్రం సక్రమంగా నీటి పంపింగ్ జరగలేదు. దీని వలన సోమవారం పలుచోట్ల పాక్షికంగానే నీటిసరఫరా జరుగుతుంది.



తెనాలిలో చెట్టు కొమ్మలు, విద్యుత్తు స్థంబాలు విరిగి పడటంతో ధ్వంసమైన చిత్రం



చేబ్రోలు : శలపాడులో గాలులకు పడిపోయిన ఆలయ ధ్వజస్థంభం



తెనాలిలో విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు



కొల్లిపర: తూములూరులో మొక్క జొన్నపై పట్టాలు కప్పుతున్న రైతులు

జీసస్ ప్రాణత్యాగంతోనే మానవులకు రక్షణ

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య

ఫిరంగిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీసస్ ప్రాణ త్యాగం వలనే మానవులకు రక్షణ మార్గం ఏర్పడిందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఆదివారం మాని కొమ్మల పండుగ సందర్భంగా ఫిరంగిపురంలోని బాల ఏసు చర్చిలో సమిష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. మానవుల పాప



దివ్య పూజాబలిలో మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

పరిహారార్ధం దేవుని ప్రణాళికతోనే జీసెస్ సామాన్యునిగా జన్మించి ఆదర్శ వంతమైన జీవితాన్ని గడిపి ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించారన్నారు. మానవులు క్షమా సమాధానాలు కలిగి ఉండాలని ఆయన బోధించారన్నారు. ఈస్టర్ పండుగకు క్రైస్త వులంతా సిద్ధ పడాలని ఆయన కోరారు. ఈ వారం పవిత్ర వారమని, క్రీస్తు శ్రమల గురించి ఎక్కువగా ధ్యానించాలని భక్తులకు ఆయన బోధించారు. ముందుగా మాని కొమ్మలను బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆశీర్వదించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం మాని కొమ్మలు చేబూని పురవీధుల్లో ప్రదర్శన జరిపారు. దివ్య పూజా బలిలో చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్లు ప్రవీణ్, రవీంద్ర, విలియం, భరత్‌రెడ్డి, గుడి పెద్దలు, కన్యస్త్రీలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వమే అంబేడ్కర్ ఆశయం

- మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం సాధించటానికి అంబేడ్కర్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలని, ఆయన బాటలోనే ముందుకు నడవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిశా నిర్దేశం చూపారన్నారు. న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన రాణించారని, ఆయన బాటలోనే భావితరాలు నడిస్తే ఆయన ఆశయాలను నెరవేర్చినవారవుతారన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకుంటూ రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడూ తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శంగా వంద పడకల ఆస్పత్రి

● మంత్రి నారా లోకేశ్ ● మంగళగిరిలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రి మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల నాటి కల. ఆ కలను నెరవేర్చే అ వకాశం ఇప్పుడు దక్కింది. భారతదేశానికే ఆదర్శంగా నిలిచేలా మంగళ గిరిలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దుతాం. ఆస్పత్రి నిర్మా ణ పనులను ఏడాదిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశా రు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి లోకేశ్ ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య కూటమి నేతలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 1984లో స్వర్గీయ ఎన్టీఆర్ యార్లగడ్డ వెంకన్న చౌదరి కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫ లకం వద్ద మంత్రి లోకేశ్ సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '1984లో ఎన్టీఆర్ మంగళగిరిలో 30 పడకల ఆస్పత్రి, చినకాకాని వద్ద కేన్సర్ ఆస్పత్రి కోసం శంకుస్థాపన చేశారు. మంగళ గిరిలో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల ద్వారా లక్షలాది మందికి వైద్యం అందించడం జరిగింది. 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కొన్ని సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నన్ను కలిశారు. ఇప్పుడున్న స్థలంలో కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సువిశాల ప్రాంగణం వుండాలనే ఆలోచనతో చినకాకాని కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందని' వివరించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంపై అనేకమార్లు సమీక్షించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే భవన నమూనాలను ఖరారు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని, ఆర్థో, డయాలసిస్ సెంటర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని, తలసేమియా, డీఎడిక్షన్ సెంటర్లను



ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. తొలుత వంద పడకల ఆస్పత్రి సాధనా కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీపీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మాజేటి వంశీకృష్ణ, కేవీఎస్ సాయిప్రసాద్, మాగంటి ప్రసాద్, రాజు నాయుడు, శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని పరిరక్షించుకుందాం

● ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీమోహన్



ఆత్మీయ సత్కారం పొందిన గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లతో మురళీమోహన్, ఆలపాటి రాజేంద్రప్రసాదు, గల్లా మాధవి, నసీర్ అహ్మద్ తదితరులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సజీవ కళైన నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ నటుడు డాక్టర్ మాగంటి మురళీ మోహన్ అన్నారు. గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, డాక్టర్ మురళీమోహన్ 52 సంవత్సరాల కళా రంగ ప్రస్థానం, వైకే నాగేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు, ఎల్వీఆర్ క్లబ్‌లో జరిగే డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఎఫైర్స్ సలహాదారులు మహమద్ షరీఫ్, ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ నాటక రంగాన్ని బతికించుకుంటేనే సినీ, టీవీ రంగాలు బతికుంటాయన్నారు. సీనియర్ నాటక రంగ కళాకారులకు పెన్షన్ ఇతర ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. ఎల్వీఆర్ క్లబ్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఎల్వీఆర్ క్లబ్‌లో కొన్ని కార్యకలాపాలకు అనుమతి రద్దు చేసిందని తిరిగి వాటిని పునరుద్ధరించాలని కోరారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కళాకారులకు కళారత్న, హంస పురస్కారాలు అందజేసిందని గుర్తు చేశారు. మంచిని ప్రచారం చేయకపోతే చెడు రాజ్యమేలుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ చంద్రబాబు చేస్తున్న మంచి పనులను ప్రచారం చేయాలని కోరారు. ఈనెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన గురించి మంచి సందేశాలను పంపితే వాటిని సామాజిక వేదికల్లో ప్రదర్శిస్తామని అన్నారు. మహమద్ అహమద్ షరీఫ్ మాట్లాడుతూ కళాకారుడు పెట్టిన పార్టీలో ఏ కళాకారులకు అన్యాయం జరగదని అన్నారు. కళాకారులకి పెన్షన్‌తో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేలా నాటక అకాడమీ కార్యవరణ రూపొందించాలని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేద కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్న మురళీమోహన్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లకు మురళీమోహన్ చేతుల మీదుగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో నాటకోత్సవ కమిటీ చైర్మన్ ఘంటా పున్నారావు, కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు, యాగంటి దుర్గారావు, పెమ్మసాని రవికుమార్, సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్, పారిశ్రామికవేత్తలు కళ్ళం మోహన్ రెడ్డి, అంబటి మోహన్, సామినేని కోటేశ్వరరావు, క్లబ్ సభ్యులు వణుగూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ. 6 లక్షల విరాళం



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షల చెక్కును డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య అందజేశారు. ఆదివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వ రరావుకు డాక్టర్ కొండబోలు వరప్రసాదుతో కలిసి ఆయన ఈ చెక్కును అందజేశారు. అనంతరం కొండబోలు బసవపున్నయ్య మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు కృషి చేస్తున్న కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ 1992-2000 కాలంలో సమితి అధ్యక్షుడుగా డాక్టర్ కొండబోలు బవసపున్నయ్య వ్యవహరిం చారని, తిరిగి ఇప్పుడు అదే సమితికి ఆయన విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న సహాయ సహకారులు గొప్పవని అన్నారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు వంకాయల పాటి బలరామకృష్ణయ్య, సభ్యులు వడ్లమూడి నాగేంద్రం. గుంటుపల్లి కోటేశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో కలకలం

● ఎస్కార్ట్ విధుల్లో నిర్లక్ష్యానికి భారీ మూల్యం ● సీఐ సహా 12 మంది సస్పెన్షన్‌తో ఉలిక్కిపడిన పోలీసు వర్గాలు ● ఉన్నతాధికారుల సీరియస్

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖలో 12 మందిపై ఒకేసారి వేటుపడిన ఉదంతం ఆ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఓ డీఎస్పీని వీఆర్‌కు పంపగా, ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బందిపై వేటు వేయడం పోలీస్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా నాడు రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ నుంచి నేడు వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వరకు పోలీసుల ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించడానికి కారణం ఎవరు..? అనే ప్రశ్నలు సర్వత్ర ఉత్పన్నమవుతున్నాయి. పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో బోరుగడ్డకు పోలీస్ స్టేషన్‌లోనే రాచ మర్యాదలు జరగడం, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్‌శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ ఘటనకు బాధ్యులుగా భావించిన నాటి వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్‌ను బదిలీ చేయగా, నాటి సీఐ కొంక శ్రీనివాసరావును వీఆర్‌కు పంపారు. నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. తుళ్లూరుకు సంబంధించిన ఓ కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీస్ కస్టడీకి తీసుకున్న అనంతరం రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలిస్తున్న తరుణంలో గన్నవరంలో ఆయనను రెస్టారెంట్‌కు తీసుకు వెళ్లడంతో.. ఈ ఘటనలోనూ పోలీసుల నిర్లక్ష్యాన్ని గుర్తించినందుకు అధికారులు ఆరుగురుపై సస్పెన్షన్ విధించారు. దీంతో బోరుగడ్డ వ్యవహారంలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి గాను సుమారు 12 మంది ఇబ్బంది పడ్డారు. మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్ వ్యవహారం మరోసారి పోలీస్ ప్రతిష్ట దెబ్బతినడానికి దారి తీసింది. గోరంట్ల మాధవ్ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించలేకపోయారనే అపవాదు మూట కట్టుకున్నారు.

చేబ్రోలు కిరణ్ విషయంలోనూ పోలీసుల అత్యుత్సాహం

టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ విషయంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అతిగా స్పందించారనే వాదన కూడా వచ్చింది. సాధారణంగా సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించిన కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 41ఎ నోటీసు జారీ చేయడమో లేదంటే కోర్టులో హాజరు పరచడమో చేయాలి. ఆయనను ఇబ్రహీంపట్నం శివారులో అదుపులోకి తీసుకున్న తర్వాత మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడ అరెస్టు చేయడమో... లేదంటే నోటీసు జారీ చేసి పంపాల్సి ఉంది. ఆయనను ఏకంగా గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకు వచ్చి మీడియా ఎదుట హాజరు పరచడాన్ని పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కిరణ్‌ను అకారణంగా గుంటూరులో మీడియా సమావేశానికి తీసుకురావడం వల్లే గోరంట్ల మాధవ్ వ్యవహారం చోటు చేసుకోవడం, అది రచ్చగా మారడం జరిగింది. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిచిన నేపథ్యంలో అదే కేసులో పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పైనా, పోలీసులపైనా దాడి, అందులోనూ ఎస్పీ కార్యాలయంలోనూ పోలీసులపై దాడికి పాల్పడడాన్ని సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు మాధవ్‌ను కూడా మీడియా ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. గోరంట్ల మాధవ్ మీడియా ముందుకు రావడానికి నిరాకరించి పోలీసులపై విరుచుకుపడడంతో ఆయనను మీడియా ముందు హాజరు పరచలేకపోయారు. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిస్తే హైలెట్ అవుతుందంటూ ఓ డీఎస్పీ ఎస్పీకి సూచించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. మాధవ్‌ను మాత్రం మీడియా ఎదుట హాజరు పరిచయలేకపోయారు. ఇది కూడా ఉన్నతాధికారుల ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు.

సిబ్బందిలో కొరవడుతున్న అంకితభావం

పోలీస్‌శాఖలో గడిచిన కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణారహిత్యానికి అద్దం పడుతున్నాయి. తాజాగా వైసీపీ నేత గోరంట్ల మాధవ్ విషయం రచ్చకెక్కింది. మాధవ్‌ను వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చినప్పుడు ఆయనకు ఎస్కార్ట్‌గా ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఎస్కార్ట్ విధుల్లో ఉన్న సిబ్బంది ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించలేదనేది సుస్పష్టం. జీజీహెచ్‌లో ఆయన రెండు దఫాలు తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడుకునే అవకాశం కల్పించడాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. మొదటిసారి గమనించిన కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి సైగ చేయడంతో వెంటనే అరండల్ పేట సీఐ వీరాస్వామి వెళ్లి సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేసి సంబంధిత ఎస్సైలు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కనీసం ఎస్ఐలు, సిబ్బంది అప్పుడైనా బాధ్యతగా వ్యవహరించారా అంటే అదీ లేదు. మరోసారి మాధవ్ తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడటం మళ్లీ అరండల్ పేట సీఐ వీరాస్వామి గమనించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి ఎస్కార్ట్ ఇన్చార్జిగా ఉన్న సీఐ వీరాస్వామి గమనించి ఆగ్రహం వ్యక్తం చేయడం తప్ప మిగిలిన ఎస్ఐలు గాని, 8 మంది సిబ్బంది కానీ ఎస్కార్ట్ విధుల్లో ఉండి ఏం చేస్తున్నారనేది ఉన్నతాధికారుల ప్రశ్న. అసలు ఆరోజు జీజీహెచ్‌లో మాధవ్, ఆయన అనుచరులకు వైద్య పరీక్షల సందర్భంగా ఏం జరిగిందనే దానిపై ఉన్నతాధికారులు ఆసుపత్రిలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. నిఘావర్గాల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఆయనకు ఎస్కార్ట్‌గా 11 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమిస్తే ఆరోజు సీసీ కెమెరాలో ఎస్కార్ట్ సిబ్బంది ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారెవరు ఆయన పక్కన కనిపించలేదు.

గోమాతల పేరుతో వైసీపీ నీచ రాజకీయం

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ

వినుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శవరాజకీయాలకు పెట్టింది పేరైన వైసీపీలో జగన్, భూమన చివరకు గోమాతలను కూడా వదలక పోవడం దారుణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండ్రి శవంతో పార్టీ పెట్టి బాబాయి శవంతో అధికారంలోకి వచ్చింది మొద లు ఎక్కడ ఏ ప్రేతం దొరుకుతుందా అనే ఎంతసేపూ వారి వెదుకులాటగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. టీటీడీ గోశాలలో ఆవులు సహజ మరణాలను కూడా రాజకీయ స్వార్థం కోసం వాడుకోవాలన్న వారి తప్పుడు ప్రచారాలు కూ డా అందులో భాగమేనని మండిపడ్డారు. అసలు వైకాపా, జగన్‌కు హిందూ ఆలయాలపై ఎందుకింత కక్షో అర్థం కావడం లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలన లో వందకు పైగా హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని, 2023లో లడ్డూ కల్తీతో తిరుమలను అపఖ్యాతి పాలు చేసింద ఇంకా ఎవరూ మరచి పోలేదన్నారు. ఇప్పుడు వంద ఆవులు చనిపోయాయంటున్న వారి అబద్ధాలకు టీటీడీ రికార్డులే నిజం చెబుతుయన్నారు. ఎక్కడివో ఫేక్ ఫోటోలు తెచ్చి భక్తుల్లో అలజడి రేపడమే ఈ కుట్ర లక్ష్యంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు స్వామివారి ఉనికినే ప్రశ్నించిన నాస్తికుడైన భూమనకు టీటీడీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు.

టీటీడీపై దుష్ప్రచారం తగదు : ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేయడాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఖండిం చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అదో నల్లరాయి.....దానిమీదకు చెప్పు విసిరితే ఏమవుతుం దంటూ గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపాడని యరపతినేని పేర్కొన్నారు. అలజడి సృష్టించేందుకు ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తూ కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమా తలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేం దుకు కుట్రలు చేస్తున్నాడన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని, వృద్ధాప్యం కారణంగా కొన్నిసార్లు ఆవులు మృత్యువాత పడుతుంటాయని, దానికే అసత్య ప్రచారం చేయడం ఏమిటని మండిపడ్డారు. గో సంరక్షణశాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడం తో పాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా ప్రభుత్వం సమీక్షిస్తుందని ఈ సందర్భంగా యరపతినేని తెలిపారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతీసి భక్తుల మనోభావాలతో ఆటలాడుకుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ఆదివారం తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీ వైసీపీ మాత్రమేనని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు దేవుళ్ల పేరుతో కూడా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల ప్రతిత్రతను కాపాడుతూ పాలన చేపట్టిందన్నారు. గో సంరక్షణకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించిందని వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలు ఇకనైనా మానకుంటే ప్రజలే తిరగబడతారని ఆలపాటి హెచ్చరించారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఆదేశాలతో విధ్వంస రచన : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన టీటీడీని తమస్వార్థ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే జగన్, వైసీపీ నేతల పన్నాగమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలతో టీటీడీని, హింధూధర్మాన్ని అన్యమతస్తుడైన భూమన కరుణాకర్ రెడ్డి బదనాం చేస్తున్నాడని, తాడేపల్లి ఆదేశాలతోనే భూమనలో ఉన్నపళంగా టీటీడీ ప్రతిష్టపై, గోవులపై వాత్సల్యం, ప్రేమ ఉప్పొంగాయని చెప్పారు. టీటీడీ గోశాలకు నిత్యం వచ్చే వేలాది భక్తులకు కనిపించని గోమరణాలు భూమనకే కనిపించడం జగన్మాయ కాదా అని అన్నారు. టీటీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయనే భూమన, వైసీపీనేతల ప్రచారమంతా అసత్యమన్నారు. జగన్ పాలనలో రథాలు తగలబడ్డా, విగ్రహాలు నరికివేయబడ్డా, ఆలయాలు కూల్చబడ్డా ఆఖరికి సాదాసీదా గుడులు మొదలు, ప్రసిద్ధ క్షేత్రాల్లో నిధులు సొంతపార్టీవారే స్వాహా చేసినా తెరవని నోళ్లు నేడు మత విద్వేషాలకోసం ఆవురావురంటూ తెరుచుకోవడం స్వార్థ, విద్వేష రాజకీయ రగడం కోసం కాదా అని ఆయన ప్రశ్నించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలో భాగమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ పై కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జియో టాగింగ్ పై, మరణాల పై తప్పుడు ప్రచారం చేయటం తగదన్నారు. గో సంరక్షణశాల పై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు గోవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందన్నారు. 260 మందికి పైగా ఉద్యోగులు గోవుల సంరక్షణకు పని చేస్తున్నారన్నారు.

అమరావతి రైలు మార్గానికి భూసమీకరణ స్కీమ్ అమలు చేయాలి

● మంత్రి నారాయణకు పెదకూరపాడు, తాడికొండ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు నూతన రైలుమార్గం కోసం పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో చేపట్టనున్న భూసేకరణకు రాజధానిలో ఎలాగైతే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ అమలు చేశారో అలానే చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు తాజాగా రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పీ నారాయణని ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. కర్లపూడి, వైకుంఠపురం, యండ్రాయి గ్రామాల్లో దాదాపుగా 800 ఎకరాల భూములు రాజధాని రైలుమార్గంలో రైతులు కోల్పోయే పరిస్థితి ఉన్నదన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల ప్రజలు విద్యుత్ హెచ్‌టీ లైన్స్ కోసం రెండు, మూడుసార్లు భూ ములు ఇవ్వడం వలన చా లా కోల్పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎవరివైతే భూములను రైలుమార్గం కోసం తీసుకొంటారో వాళ్లందరికి అమరావతి రాజధానిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద నివాస, వాణిజ్య ప్లాట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందుకు మంత్రి నారాయణ స్పందిస్తూ తాను ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

నేడు పలు ప్రాంతాల్లో పాక్షిక నీటి సరఫరా

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలుల వల్ల చెట్లు పడిపోయి సంగం జాగర్లమూడిలో విద్యుత్ వైర్లు తెగి నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. నాజ్‌సెంటర్ రిజర్వాయర్ పరిధిలో గల పొత్తూరి వారి తోట, రాజా గారి తోట, గుంటూరు వారి తోట, కొత్తపేట ఏరియా, ఎస్సీ కాలనీ, రామిరెడ్డితోట, పాల ఆసుపత్రి ఏరియా, లాలాపేట ఏరియా, నల్లచెరువు, పట్నం బజార్, చౌత్రా సెంటర్, గణేష్‌రావు పేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం పాక్షిక తాగునీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం శంకరన్ సమావేశ మందిరంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు డీఆర్వో ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

నేడు పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్...

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్ కార్యక్రమం తాత్కాలిక రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలు ఇవ్వదలచుకున్న ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



అధ్యాపకురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ అధ్యాపక ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కూటమి కృషి చేస్తుందని, విద్యారంగ అభివృద్ధికి వారు కృషి చేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2025 ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు హాజరయ్యారు. తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దేశాభ్యున్నతిలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల పాత్ర ఎనలేనిదని సమాజానికి అవసరమైన విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గర్వించదగినదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌరవఅతిథులుగా ఏఎన్‌యూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వి.కన్నా మాస్టారు, అపూస్మా రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కే మోజెస్, ఆంధ్ర న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.రాణి శ్రీఅమృత వర్షిని తదితరులు హాజరయ్యారు. నిర్వహణ కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.నాగయ్య కె.గోవిందరాజులు, కొండపల్లి విల్సన్, పీఆర్ రతన్‌కుమార్, ఎన్వీఎస్ రఘు ప్రదీప్ ఎం రాకేష్, వీఎస్ ఆదిత్య డి.నాగమణి ఎస్పీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరావు సాహిత్యం వెలకట్టలేనిది

● కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వామపక్ష, దళిత, బహుజన సామాజిక సాహిత్య దృక్పథంతో రచనలు చేసిన డాక్టర్ వీ చంద్రశేఖరరావు సాహిత్యం వెలకట్టలేనిదని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డాక్టర్ వీ చంద్రశేఖరరావు జయంతి సాహిత్య పురస్కార సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమ ప్రభావ నేపథ్యంలో ఆ ఉద్యమానికి దోహదం చేసే రచన లు సాగించారన్నారు. కథా సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ యువ కథకులు ముందుతరం కథకుల రచనలు అధ్యయనం చేయాలని సూచించారు. సినీ దర్శకుడు సీ ఉమామహేశ్వరరావు, కందిమళ్ల శివప్రసాద్‌లు ప్రసంగించారు. అనంతరం కలుంకూరి గుట్ట కథా సంపుటి రచయిత కేవీ మేఘనాథరెడ్డికి 2025వ సంవత్సరపు డాక్టర్ వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ వి.ప్రసూన అందజేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ దయానంద్, పుప్పాల శ్రీరాం, పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, పారా అశోక్, మన్నం సింధు, మాధురి పాల్గొన్నారు.



చంద్రశేఖరరావు పురస్కారం అందుకున్న కేవీ మేఘనాథ్‌రెడ్డితో పెనుగొండ లక్ష్మీ నారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు

16 నుంచి జిల్లా స్థాయి చదరంగం ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఈ నెల 16, 17 తేదీల్లో బాల, బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి చదరంగం ఎంపికలు జరుగుతాయని టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో భాగంగా 16న అండర్-15, 17న అండర్-19 విభాగాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంపికలకు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరవ్వాలని అన్నారు. వివరాలకు 90631 42105లో సంప్ర దించాలని సూచించారు.

పెన్షనర్లకు కరువు భత్యం పెరుగుదల విధి విధానాలు

● ఈదర వీరయ్య

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు కరువుభత్యం (డీఏ) పెరుగుదల విధి విధానాల గురించి రాష్ట్ర పెన్షనర్ల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు. నెలవారీ వేతనాలపై ఆధారపడే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల కొనుగోలు శక్తి ధరల పెరుగుదల కారణంగా నానాటికీ క్షీణిస్తుం దన్నారు. రూపాయి విలువ దిగజారుతున్న నేపథ్యంలో నిజ వేతనాలు తగ్గుతున్నాయని, దీంతో వేతన జీవుల, పెన్షనర్ల ఆర్థిక పరిస్థితి క్రమంగా దిగజారుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను ఆదుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ఆరు నెలలకొకసారి కరువు భత్యం - ప్రకటిస్తుందన్నారు. కేంద్రం ప్రకటించిన డీఏ శాతాన్ని పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ మంజూరు చేస్తుందన్నారు. ఎంత శాతం డీఏ ఇవ్వాలనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాతిపాదికన నిర్ధారిస్తుందనే విషయం తెలుసుకోవాలని పెన్షనర్లకు ఉంటుందన్నారు. మూడు రకాల ధరల సూచికలు అఖిల భారత కంజూమర్స్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా వినియోగదారుల ధరల సూచికలు మూడు రకాలుగా ఉంటాయన్నారు. మొదటిది పారిశ్రామిక వర్కర్ల వినియోగ దార్ల ధరల సూచిక కాగా, రెండోది వ్యవసాయ రంగం కూలీల ధరల సూచిక, మూడోది గ్రామీణ కూలీల ధరల సూచిక, అఖిల భారత పారిశ్రామిక వర్కర్ల వినియోగదారుల ధరల సూచిక ప్రాతిపాదికగా మాత్రమే, కేంద్ర ప్రభుత్వం 6 నెలలకొకసారి డీఏ శాతాన్ని నిర్ధారించి ప్రకటిస్తుంది. దేశవ్యాప్తంగా 78 మహానగరాల నుంచి వినియోగదారులు 24 రకాల వస్తువులకు చెల్లించే ధరలను సేకరిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఒక్క శాతం డీఏకు రాష్ట్ర ప్రభుత్వం 0856 డీఏ చెల్లిస్తుందన్నారు. డీఏ మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కోసారి జాప్యం చేస్తుందన్నారు. కేంద్రం తరహాలో ప్రతి మార్చి, సెప్టెంబరు నెలలో డీఏ వాయిదాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయాన్ని సత్వరమే ప్రకటించాలని వీరయ్య కోరారు.



కోబాల్ట్‌పేట వైపు రంగులతో తీర్చిదిద్దిన బ్రిడ్జి పిల్లర్స్



బ్రిడ్జి వద్ద విరిగిపోయిన గ్రిల్స్

పైన పటారం.. కింద అపరిశుభ్రం

● ఇదీ కంకరగుంట ఆర్‌యూబీ నిర్వహణ

పైన చూస్తే కళ్లు మిరుమిట్లు గొలిపే రంగులతో అందమైన, ఆకర్షణీయమైన బొమ్మలు... మనం హైదరాబాదులో ఉన్నామా అని భ్రమపడే పరిస్థితి... కొద్దిగా పరిశీలించి కింద చూస్తే ఊడిపోయిన గ్రిల్స్. ఎండిపోయిన చెట్లు... మద్యం తాగి పడేసిన బాటిల్స్, చెత్తా, చెదారాం. ఇదీ కంకరగుంట ఆర్‌యూబీ నిర్వహణపై అధికారులు చూపుతున్న శ్రద్ధ. కమీషన్ల కోసం రెండేళ్లకు ఒకసారి రంగువేయడం మినహా ఆర్‌యూబీ సుందరీకరణ, ప్లాంటేషన్ కోసం తీసుకుంటున్న చర్యలు శూన్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- గుంటూరు(ఆంధ్రజ్యోతి)



ఆహ్లాదం కనుమరుగై అపరిశుభ్రంగా ఉన్న బ్రిడ్జి మధ్య భాగం

పారిశుధ్య పనులను పర్యవేక్షించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగ రంలో మెరుగైన పారిశుధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో విధులకు హాజరై పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, కేవీపీ కాలని, లాలుపురం రోడ్డు, అరండల్‌పేట, శంకర్‌విలాస్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ప్రజారోగ్యాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో మెరు గుదల లేక ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది, ప్రజా రోగ్యాధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొ న్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాల ఆశాజ్యోతి బీపీ మండల్ అని మండల సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిహార్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల రెండో ముఖ్యమం త్రిగా బీపీ మండల్ సేవలు అందించారని అన్నారు. బీసీ ప్రతినిధి, రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ దామాషా ప్రాతిపది కన బీసీలకు రాజ్యాంగ హక్కులతో పాటు అన్ని రకాల హక్కులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో బీ వీరస్వామి, దాసరి శివకుమార్, ఉగ్గం సాంబశివరావు, సీహెచ్ వాసు, సుబ్రహ్మణ్యం శాఖమూరి సాంబశివరావు, వి.రాజశేఖర్ పాల్గొని మండల విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.

అనాథ ఆశ్రమంలో 'యరపతినేని' జన్మదిన వేడుకలు



బియ్యం అందిస్తున్న రామకృష్ణప్రసాద్ తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టాభిపురంలోని మాతృశ్రీ అనాథ పిల్లల ఆశ్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేద లకు, అనాథలకు సేవ చేయడంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముందుంటారని అన్నారు. ఆశ్రమానికి బియ్యం టిక్కీలను రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ పులుకురి వెంకట్రావు, గుంటూరు పార్లమెంటు విభాగం ప్రధాన కార్యదర్శి వాసు పొదిల, సువర్ణ కుటీర్ మేనేజింగ్ డైరెక్టర్ జటావత్ రాంబాబు నాయక్, బండ్ల వెంకట్రావు, రాధాక్రిష్ణ, చౌడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడారి ఓడ వజ్రోత్సవ జ్ఞాపిక పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంక టేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం సహజ సాహితీ వ్యవ స్థాపక అధ్యక్షుడు చీరాల వడలి రాధాకృష్ణ రచించిన ఎడారి ఓడ (వజ్రోత్సవ జ్ఞాపిక) పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సంఘ సేవకులు బత్తుల మురళి, గౌరవ అతిథులుగా రచయితలు గొర్రెపాటి శ్రీను, డాక్టర్ పెరుగుపల్లి బలరాం, ఎస్ సన్యాసిరావు, తెలుగుభాష వికాస సమితి అధ్యక్షుడు (గుడివాడ) డాక్టర్ డీఆర్‌బీ ప్రసాద్, అమ్మవడి అధ్యక్షుడు ఏ శ్రీనివాసరావు, సమన్వయకర్తగా విశాలసాహితీ సమితి డాక్టర్ విద్యాధరరావు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య ప్రారంభించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చేయూత అవసరం : గోనుగుంట్ల

గుంటూరు (విద్య) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థలు నిర్వహించాయి. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని, పుస్తక పఠనంపై ప్రాథమిక స్థాయిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రముఖ గ్రంథాలయ శాస్త్రవేత్త పీజీ కుమార్ ఎండోమెంట్ ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలో పనిచేసే గ్రంథాలయ అధిపతులు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా రజినికుమారి, కార్యదర్శిగా డాక్టర్ గుండవరపు సాయి ప్రసాద్ ఎన్నికయ్యారు.

ఘనంగా మట్టల ఆదివారం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి వివిధ సంఘాలు, చర్చిలకు చెందిన క్రైస్తవులు కొబ్బరి మట్టలు చేబూని ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. హోసన్నా.. జయము.. జయము అంటూ నినాదాలు చేశారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారని అన్నారు. మరణించిన యేసు తిరిగి పునరుద్ధానుడై లేచుట ద్వారా ఆయన సజీవుడైన దేవుని కుమారుడని నిరూపణ అయ్యిందని తెలిపారు. క్రీస్తు శ్రమలను తలచుకునేందుకు 40 రోజులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని అన్నారు. ఈస్టర్ ముందు వచ్చే ఆదివారం మట్టల ఆదివారం అని పేర్కొన్నారు.



మట్టల ఆదివారం సందర్భంగా గుంటూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

● మెనింజియోమెటోసిస్‌కు న్యూరో నావిగేషన్ సర్జరీ



మాట్లాడుతున్న న్యూరోసర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడారు. ఆదివారం మంగళదాస్ నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు ఈ కేసు వివరాలను తెలిపారు. యాభై ఏళ్ల మహిళ తరచూ మూర్ఛలతో బాధపడుతూ ఇటీవల కిమ్స్ హాస్పిటల్‌లో న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్ ప్రదీప్ కుమార్‌రెడ్డిని కలిశారు. వైద్యపరీక్షల్లో ఆమె మెనింజియోమెటోసిస్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేస్తే రోగులు కోలుకుంటారు. అయితే ఈ మహిళ మెదడులో నాలుగు చోట్ల కణితులు ఉండటంతో ఆపరేషన్ చేయడం వైద్యులకు సవాల్‌గా మారింది. న్యూరోసర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, వైద్యపరీక్షల్లో ఈ కణితులు కేన్సర్ ట్యూమర్లు కావని నిర్ధారించు కొని, సవాల్‌గా తీసుకొని సర్జరీని నిర్వహించారు. 500 గ్రాములు బరువు ఉన్న నాలుగు బ్రెయిన్ ట్యూమర్లను తొలగించారు. ఆరోగ్యపరంగా కోలుకున్న రోగిని ఆదివారం డిశ్చార్జి చేశారు.

భయపెట్టిన గాలి దుమారం

● పరుగులు పెట్టిన మిర్చి రైతులు

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గాలి దుమారం మిర్చి రైతులను భయపెట్టిం చింది. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి పలు దఫాలుగా గుంటూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. దీంతో మిర్చియార్డులో తమ మిర్చి బస్తాలు ఎక్కడ తడిచిపోతాయోనని రైతులు ఆందోళన చెందారు. టార్పాలిన్ పట్టాల కోసం పరుగులు పెట్టారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి టార్పాలిన్ పట్టాలు తీసుకొచ్చి మిర్చి టిక్కీలపై రక్షణగా కప్పారు. మరోవైపు పెనుగాలులకు నగరంలో పలుచోట్ల విద్యుత్ తీగెలు తెగిపడటం, చెట్లకొమ్మలు విరిగిపోవడం, హోర్డింగ్‌లు పడిపోవడంతో విద్యుత్ సర ఫరాకు పలుమార్లు అంతరాయం వాటిల్లింది. ఆదివారం సెలవుదినం కావడంతో షికారు కోసం సండేమార్కెట్‌కి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లపై వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులకు చెందిన వస్తువులు గాలికి ఎగిరిపోవడంతో వాళ్లకి నష్టం జరిగింది.



మిర్చియార్డులో మిర్చి టిక్కీలకు టార్పాలిన్ పట్టాలు కప్పుతున్న రైతులు

ప్లస్ టూ పాఠశాలల్లో ఇంటర్ ఫలితాలు అంతంత మాత్రమే

● అనేక పాఠశాలల్లో సింగిల్ డిజిట్‌లోనే పరీక్షకు హాజరు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీ పాలనలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ప్లస్ టూ పాఠశాలల్లో ఇంటర్ ఉత్తీర్ణత నానా టికి తీసికట్టు నాగంబొట్లు అన్నచందంగా తయారైంది. ఈ ఏడాది కూడా అట్టడుగులో నిలిచాయి. అనేక పాఠశాలల్లో సింగిల్ డిజిట్‌లో విద్యార్థులు ఉన్నా ఫలితాలు మాత్రం అధ్వానంగానే ఉన్నాయి.

● ఎస్వీపీ జడ్పీ స్కూల్లో ఎంపీసీ మొదటి సంవత్సరం పరీక్షకు ఏడుగురు విద్యార్థులు హాజరుకాగా వారిలో నలుగురు, బైపీసీలో నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు.

● కొర్నేపాడు జడ్పీ స్కూల్లో మొదటి సంవత్సరం ఎంపీసీలో 11 మంది పరీక్షకు హాజరుకాగా ఐదుగురు, బైపీసీలో 10 మందికి గాను నలుగురు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో మాత్రం ఎంపీసీలో నలుగురు పరీక్షకు రాయగా నలుగురు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 13మంది పరీక్ష రాయగా 12 మంది ఉత్తీర్ణత సాధించారు.

● తాడికొండ మండలంలోని ప్లస్ టూ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఫెయిల్ అయ్యారు. బైపీసీలో 31మంది పరీక్ష రాయగా ఏడుగురు మా త్రమే ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ బైపీసీలో కలిపి 11మంది విద్యార్థులు పరీక్ష రాయగా 10మంది పాసయ్యారు.

● జడ్పీహెచ్ఎస్ వడ్డేశ్వరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 16 మంది పరీక్షకు హాజరుకాగా ఏడుగురు, బైపీసీలో 13 మంది పరీక్ష రా యగా ఇద్దరు పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 13 మంది పరీక్ష రాయగా ఐదుగురు, బైపీసీలో 8 మందికి ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు.

● పొన్నూరులోని జడ్పీహెచ్ఎస్ (వెల్లూరు) ప్లస్ టూలో మొదటి సంవత్సరం నలుగురు విద్యార్థులు పరీక్ష హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవ త్సరం సీఈసీలో పది మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా నలుగురు పాసయ్యారు. బైపీసీలో ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించాడు.

● పత్తిపాడులోని వీఆర్ జడ్పీహెచ్ ప్లస్ టూలో ఇంటర్ సంవత్సరం పదిమంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 8 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 16 మంది విద్యార్థులకు గాను ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

● జడ్పీహెచ్ఎస్ తుమ్మలూరు ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏడుగురు పరీక్ష హాజరుకాగా ఒక్కరే ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 12 మంది విద్యార్థులకు గాను 7మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఐదుగురికి ముగ్గురు, బైపీసీలో పది మందికి 8 మంది ఉత్తీర్ణులయ్యారు.

● జడ్పీహెచ్ఎస్ కొల్లిపరలో సీఈసీ గ్రూపులో ఒకే విద్యార్థి ఒక విద్యార్థి పరీక్షకు హాజరుకాగా ఉత్తీర్ణత సాధించాడు. ఇలా అరకొర ఫలితాలు ఇంటర్‌లో నమోదయ్యాయి.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ అర్హుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే నసీర్

● మొత్తం ఐదుగురికి రూ.14 లక్షలు మంజూరు

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మంది చికిత్సలు తీసుకుని ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ళకు ఎమ్మెల్యే నసీర్ నేరుగా వెళ్లి చెక్కులు అందజేశారు. బెల్లంకొండ వరలక్ష్మికి రూ. 2,67,680, ఎం శ్రీనివాసరావుకు రూ.2,20,400, వడ్డి గోపాలకృష్ణకు రూ.3,00,193, చావలి వెంక టేశ్వర్లుకు రూ.2,18,537, వెంకట లక్ష్మీ నరసింహారావుకు రూ.3,05,094కు చెక్కులు మంజూరయ్యాయి. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయా కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అశోక్, మీరావలి, జ్యోతి, సంకూరి శ్రీను, వెంకటేశ్వర్లు, సాది నేని శ్రీనివాస్, వేల్పూరి కిరణ్, అన్వర్, జబీ, పిచ్చిరెడ్డి, శైలజ, సతీష్, వీర్రాజు, కన్నెబోయిన సాయి, నరేష్, ఆంజనేయ ప్రసాద్, చిన్నా బుజ్జి తదితరులున్నారు.

కూటమితోనే తిరుమల పవిత్రత..

తిరుమల, తిరుపతి పవిత్ర, ధార్మిక రక్షణ కోసం సీఎం చంద్రబాబు మరింత కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే తిరుమల తిరుపతి పవిత్ర సాధ్యమవుతుందన్నారు. పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని ఖండించారు.

రాజకీయ మనుగడ కోసమే టీటీడీ గోశాలపై అసత్య ప్రచారాలు

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ నాయకులు టీటీడీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల గోశాలపై వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో సౌకర్యాలు, లడ్డూ, దర్శనాలు వంటి వాటిపై భక్తులు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎక్కడ ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తుందోనన్న భయంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. దేవుడిని కూడా రాజకీయంలోకి లాగే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రాబోయే రోజుల్లో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. అనకాపల్లి బాణసంచా పరిశ్రమలో అగ్ని ప్రమాదంపై మన్నవ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు మరణిం చడం దురదృష్టకరమని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకో వాలని అధికారులను కోరారు.

అత్తోట జోసఫ్ వైసీపీకి రాజీనామా

● పార్టీలో దళితులను చిన్నచూపు చూస్తున్నారంటూ ఆరోపణ

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు అత్తోట జోసఫ్‌కుమార్ వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీకి, ఆ పార్టీలో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీలో తొలి నుంచి వివిధ హోదాల్లో పనిచేశానని, అనేక కేసులు పెట్టించుకోవాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ పార్టీ తనను నిర్లక్ష్యం చేసిందని, మాదిగ సామాజికవర్గానికి, ముఖ్యంగా దళితులకు పార్టీలో గౌరవంలేదని ఆరోపించారు. అందుకే పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

● ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ వరప్రసాద్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మాతృభాషకి ప్రాధాన్యమిచ్చి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం పునరుద్ధరించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో బదిలీలు, పదోన్నతులు, రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షత వహించారు. పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ బదిలీలు చట్ట రూపంలో రావడం వల్ల ప్రతి సంవత్సరం ఎవరు డిమాండ్ చేయకుండానే బదిలీలు, పదోన్నతులు చేపట్టవచ్చని కానీ తెలు గు రాష్ట్రంలో మాతృభాష (తెలుగు మీడియం)లో చదువుకునే వీల్లేకుండా చేయడం అన్యాయమన్నారు. ఇపుడు కొనసాగుతున్న ఆంగ్ల మాధ్యమంతో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్‌బాషా, మక్కెన శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీద్, ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, పుట్టా జనార్ధనరావు, పి.లక్ష్మీనారాయ ణ, జిల్లా శాఖ కార్యదర్శులు మూర్తి, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కృపా మహాసభలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు ఎదుట కృపా మినిస్ట్రీస్ 19వ అంతర్జాతీయ కృపా మహాసభలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు. ప్రార్థనల్లో పాస్టర్ జాకబ్ పాల్గొని ప్రతి మనుష్యుడు రక్షణ పొంది క్రీస్తుతో నిత్యజీవంలో ఉండాలని సందేశమిచ్చారు. చివరిగా కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ మాథ్యూస్ ముఖ్య వర్తమానాన్ని అం దించారు. దేవుని సంఘంలో ఉన్న వారిని శ్రేష్ఠమైన బహుమానాలతో నింపి ఫలభరిత మైన జీవితాన్ని మహిమతో వారి జీవితాలను నింపుతారని తెలియజేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన సభలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలి పారు. ఈ సందర్భంగా కీర్తన గ్రంథం 119వ అధ్యాయంలోని 176 వచనాలను చూడ కుండా చెప్పిన కృపా సండే స్కూల్ చిన్నారులను మాథ్యూస్ అభినందించి. బహుమతులు అందజేశారు.

ఓ హాస్పిటల్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థిని మృతి

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో గల ఓ ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా లాస్య అనే విద్యార్థిని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. లాస్య అనే విద్యార్థినికి ఫిట్స్ రావడంతో ఈ నెల 9న రాత్రి కొత్తపేటలోని ఓ హాస్పిటల్‌లో చేర్చారు. 10న మధ్యాహ్నం 3 గంటల సమయంలో డాక్టర్లు తల్లిదండ్రులను కలిసి ప్రస్తుతం లాస్య పరిస్థితి విషమంగా ఉందని తెలియజేశా రు. దీంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి తక్షణమే లాస్యను తీసుకొని అంబులెన్స్‌లో హైదరాబాద్ బయల్దేరారు. దార్లోనే లాస్య మృతి చెందింది. కేవలం కొత్తపేటలోని డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే ఓ నిండు ప్రాణం బలైందని కుటుంబసభ్యులు వాపోయారు.

'ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్న వైసీపీ, కాంగ్రెస్'

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు వ్యవహారంలో వైసీపీ, కాంగ్రెస్‌లు ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్నాయని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖుద్దూస్, మైనారిటీ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ షేక్ రఫీ ఆరోపించారు. ఆది వారం గుంటూరు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీని తిట్టే వేదిక పై ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ఎలా ఉంటారని ప్రశ్నించారు. వక్ఫ్ సవర ణ బిల్లు వల్ల పేద ముస్లింలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఇప్ప టివరకు ధనికుల చేతుల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులన్నీ ప్రభుత్వ ఆధీనంలో కి రావటం వల్ల వాటిపై వచ్చే ఆదాయం పేద ముస్లింలకు అందు తుందని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ గౌస్ పీరా, షేక్ మౌలాలి, షేక్ ఫరహానా, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెండి పట్టీలతో ప్రయోజనాలెన్నో...!

పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆడపిల్లలు, యువతులు, మధ్యవయసు మహిళలు తమ పాదాల అలంకరణలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తూ ఉంటారు. కేవలం అందానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా ఈ వెండి పట్టీలు దోహదం చేస్తాయి. ఆ వివరాలు తెలుసుకుందాం....



- పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. పాదాల నొప్పి, వాపులు తగ్గుతాయి. ఎముకలు బలపడతాయి. మోకాళ్ల నొప్పి, నడుం నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- వెండిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. అందుకే వెండి పట్టీలు పెట్టుకుంటే పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావు.
- వెండి శీతల లోహం. నిత్యం వెండి పట్టీలు పెట్టుకుని ఉండడం వల్ల మహిళల్లో శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. శరీరానికి చలువదనం చేకూరుతుంది. వేసవిలో పాదాలు వేడెక్కడం, అరికాళ్లలో చెమటలు పట్టడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- వెండి.. శరీరంలోని విద్యుత్ చలన శక్తిని సమన్వయం చేస్తుంది. అందుకే మహిళలు తమ పాదాలకు వెండి గొలుసులు, పట్టీలు పెట్టుకోవడం వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని హార్మోన్లు సమతౌల్యంలో పనిచేస్తాయి. రుతు సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- రంగురంగుల రాళ్లు, మువ్వలతో విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పట్టీలు పెట్టుకోవడం వల్ల మహిళలకు మానసిక ఆనందం కలుగుతుంది.
- అధిక బరువున్న పట్టీలు కాకుండా తేలికగా ఉన్నవాటిని ధరిస్తే నడవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. నాణ్యమైన వెండితో రూపొందించిన పట్టీలు ఎంచుకోవడం మంచిది.



అందం అంటే అంతకుమించి

మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ 85 ఏళ్ల జూలియా మోర్లీని చూస్తే 60 ఏళ్లు అనిపిస్తుంది. ఈ ప్రపంచానికి ఏదో చేయాలనే తపన అనుక్షణం కనిపిస్తూ ఉంటుంది. "అందం అనేది బాహ్యశరీరంలో మాత్రమే ఉండదు.. వ్యక్తిత్వంలో కూడా ఉంటుంది.. ఈ రెండూ కలిసినదే అసలైన అందం" అంటారు జూలియా. కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) సహా అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన జూలియాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం ఉంది. వచ్చే నెల ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవటానికి కారణమేమిటి?

ప్రపంచ సుందరి పోటీలను ప్రతి ఏడాది వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తూ ఉంటాం. ఈ సారి తెలంగాణను ఎంపిక చేశాం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. నేను ఇక్కడ ఎవరికీ చెప్పని ఒక విషయం చెబుతాను. నాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం. ఎందుకంటే సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను, ఎరిక్ (జూలియా భర్త) భారత్‌కు వచ్చి అనేక ప్రాంతాలు తిరిగాం. ఆ సమయంలో మేము మహిళలకు శానిటరీ నేప్‌కిన్స్ ఇచ్చే ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాళ్లం. ఆ సమయంలో హైదరాబాద్‌కు కూడా వచ్చాం. ఆ కార్యక్రమ నిర్వహణలో మాకు పోలీసులు చాలా సాయం చేశారు. అందుకే హైదరాబాద్ అనగానే పోలీసుల ఔదార్యం గుర్తుకు వస్తుంది. ఇది చాలా కాలం క్రితం జరిగి సంఘటన. కానీ నిన్న జరిగినట్లు అనిపిస్తోంది. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. వారందరికి నా ధన్యవాదాలు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో హైదరాబాద్ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలియని ఒక రహస్యం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల ఆఫీసులు ఇక్కడ ఉన్నాయి. ఇదొక అందమైన నగరం. కానీ దీని గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రపంచ సుందరి పోటీలు ఈ నగరానికి కొత్త గుర్తింపు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడకు మరింతగా రావాలని కోరుకుంటున్నా.

ప్రపంచ సుందరి పోటీలు దేనికి చిహ్నంగా భావించాలి?

ఒక అందమైన అమ్మాయిని ప్రపంచ సుందరిగా ప్రకటించటం మా ఉద్దేశం కాదు. నా దృష్టిలో అందం అంటే శరీర సౌందర్యం కాదు. అందమైన మొహం.. పెదాలు.. అవయవ సౌష్టవం ఉంటే ప్రపంచ సుందరిలు కారు. వారికి అందమైన వ్యక్తిత్వం ఉండాలి. ఇతరులకు సాయం చేసే గుణం ఉండాలి. అందుకే ఈ పోటీలను నేను 'బ్యూటీ విత్ పర్పస్' అని పిలుస్తాను. ఇక్కడికి వచ్చే అందగత్తెలందరూ వారి వారి దేశాల్లో చేయదలుచుకున్న ప్రాజెక్టులను తీసుకువస్తారు. వారు ఏ ప్రాజెక్టులు చేయాలనే విషయాన్ని మేము వారికి చెప్పం. వారి ఊహాశక్తి.. కొన్ని అంశాలపై వారికి ఉన్న నిబద్ధతల ఆధారంగా వాటిని వారు ఎంపిక చేసుకుంటారు. ఇలా ప్రతి ఏడాది సుమారు 130 ప్రాజెక్టులు వస్తాయి. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసి వాటికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. అందుకే ప్రపంచ సుందరి పోటీలంటే భౌతికపరమైన అందం మాత్రమే కాదని చెప్పగలుగుతున్నాను.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలలో ఫార్మాట్ మార్చినట్లున్నారు కదా..

ఫార్మాట్‌లో మార్పులు జరుపుతూనే ఉంటాం. ఉదాహరణకు ఒకప్పుడు స్విమ్‌సూట్ రౌండ్ ఉండేది. అది ఇప్పుడు లేదు. బీచ్‌లో ఉన్నప్పుడు స్విమ్ సూట్ వేసుకుంటాం. ప్రతి రోజు దాన్ని వేసుకొని తిరగం కదా! అంతే కాదు ...వ్యక్తిగతంగా కూడా నాకు స్విమ్‌సూట్ వేసుకొని ఇతరుల ముందుకు నడుచుకుంటూ రావటం ఇష్టం ఉండదు. కానీ కొన్ని పరిస్థితులకు తగ్గట్టుగా ఆ రౌండ్ ఉండేది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. మేము 1953లో ప్రపంచ సుందరి పోటీలను ప్రారంభించినప్పుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రపంచమంతా రెండో ప్రపంచయుద్ధ ఒత్తిడి నుంచి తేరుకుంటోంది. ఈ సమయంలో ప్రజలందరిలోను ఒక విధమైన నిరాశ, ఆందోళన ఉండేవి. ఆ సమయంలో వారిలో సంతోషం నింపటానికి ఏదైనా చేస్తే బావుండనని పించింది. ప్రపంచసుందరి పోటీలు అలా పుట్టాయి. దీనిని ప్రపంచ ప్రజలందరూ ఆదరించారు. పరిస్థితులకు అనుగుణంగా మేము ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూనే ఉంటాం.

ప్రపంచ సుందరి పోటీల ద్వారా వచ్చిన సంపాదనను ఏం చేస్తారు? ఎలా ఖర్చు పెడతారు?

మాకు ఈ పోటీల నుంచి వచ్చే డబ్బులో ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. డబు సంపాదించటం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు. వచ్చిన డబ్బు మొత్తం మేము నిర్వహించే ప్రాజెక్టులపైనే ఖర్చు పెడతాం. ఈ ప్రాజెక్టులు విజయవంతమయినప్పుడు కలిగే ఆనందానికి వెల లేదు. ఉదాహరణకు మేము ఇండోనేషియాలో ఒక ప్రాంతంలో ఒక వంతెన నిర్మించాం. దాని వల్ల కొన్ని వందల మందికి లబ్ధి చేకూరుతోంది. అక్కడున్న పిల్లలు స్కూలుకు వెళ్లగలుగుతున్నారు. ఆ పిల్లలను కలిసినప్పుడు వారు చూపించిన ప్రేమ అమూల్యమైనది. అంతేకాకుండా- ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వేల మంది వలంటీర్లు తమ పరిధిలో సమాజంలో మార్పు తేవటానికి చేస్తున్న ప్రయత్నాలను డబ్బులతో వెలకట్టలేం.

మీరు ఇన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు కదా.. మరచిపోలేని సంఘటనలు ఏవైనా ఉన్నాయా?

చాలా ఉన్నాయి. కానీ ఒక సంఘటన మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను. మేము నైజీరియాలో పోటీలను నిర్వహించాలనుకున్నాం. అక్కడి ప్రభుత్వం కూడా చాలా సాయం చేసింది. పోటీల సమయంలోనే అమీనా అనే అమ్మాయిని రాళ్లతో కొట్టి చంపారని ఒక అంతర్జాతీయ పత్రికలో వార్త వచ్చింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనం చెలరేగింది. వాస్తవానికి ఆ సంఘటన జరగలేదు. కొందరు పాశ్చాత్య జర్నలిస్టులు కావాలని రాసిన వార్త. ఆ విషయం మాకు తెలుసు. కానీ ప్రపంచానికి తెలియదు కదా! ప్రపంచమంతా అలజడి ప్రారంభమయింది. దీనితో రాత్రికి రాత్రి పోటీలను రద్దు చేసుకున్నాం. ఒక విమానాన్ని అద్దెకు తీసుకొని పోటీదారులందరితో ఇంగ్లాండ్ వచ్చేశాం. రాత్రికి రాత్రి వందల మందిని ఒక దేశం నుంచి మరొక దేశానికి తీసుకురావాలంటే ఎంత ఒత్తిడి ఉంటుందో ఆలోచించండి! ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం.

ఈ పోటీలలో బీద.. ధనిక దేశాల నుంచి వచ్చిన యువతులు ఉంటారు. వారిలో కొందరికి విపరీతంగా ఖర్చు పెట్టే స్తోమత లేకపోవచ్చు. అలాంటప్పుడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు..

ప్రతి దేశంలోను మిస్‌వరల్డ్ తొలి రౌండ్ పోటీలను నిర్వహించటానికి కొందరు లైసెన్స్ హోల్డర్స్ ఉంటారు. వారు వారి దేశాలలో నెగ్గిన వారికి స్పాన్సరర్స్‌ను తీసుకువస్తారు. ఒకప్పుడు దుస్తుల మీద ఎక్కువ ఖర్చు పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ ఖర్చు విపరీతంగా ఉంటోంది. అందుకే నేను జ్యూరీ సభ్యులకు "మీరు ఎవ్వరి ఒత్తిడికి లొంగవద్దు. ఇతరులు ఏం చేస్తున్నారే విషయాన్ని చూడద్దు. మీరు స్వయంగా నిర్ణయాలు తీసుకోండి.." అని చెబుతూ ఉంటా. "ఒక అమ్మాయి అద్భుతమైన డ్రస్సు వేసుకుంటే ప్రపంచ సుందరి అయిపోతుందా? ఇంకో అమ్మాయి ఇతరుల కన్నా బాగా మాట్లాడగలిగితే ప్రపంచ సుందరి అయిపోతుందా?" అని అడిగితే "కాదు" అని కచ్చితంగా చెప్పగలను.

- అందం అనేది చాలా చిత్రమైన పదం. ఒక అమాయకమైన పాప మొహంలో కనిపించే అందం కొందరు మాత్రమే చూడగలుగుతారు. చాలా సార్లు అందం అనే పదాన్ని తప్పుగా వాడుతూ ఉంటారు. నా ఉద్దేశంలో ప్రేమ, నిబద్ధత, ఇతరులకు సేవ చేయాలనే కోరిక, మంచి వ్యక్తిత్వం, చురుకుదనం- ఇవన్నీ కలగసినప్పుడే నిజమైన అందం కనిపిస్తుంది.
- మొత్తం ప్రపంచమంతా ఒకరితో మరొకరు ఎటు వంటి అమరికలు లేకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోగలిగిన రోజు రావాలనేది నా కోరిక. అన్ని చోట్ల భిన్నాభిప్రాయాలు ఉంటాయి. రకరకాల ప్రతికూల భావాలు కూడా ఉంటాయి. వాటన్నింటినీ అధిగమించగలిగినప్పుడు అందమైన ప్రపంచాన్ని సృష్టించుకోగలుగుతాం.
- ఈ సారి పోటీల తర్వాత తెలంగాణకు ఏదో విషయంలో మేలు చేయాలనేది మా ఉద్దేశం. ముఖ్యంగా పిల్లలకు, మహిళలకు సంబంధించిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకుంటాం.

• సివిఎల్ఎన్. ప్రసాద్



కోట్ల రూపాయలు వదులుకున్నా

సమంత



మహిళా సాధికారతపై తరచూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మానసిక ఆరోగ్యం, వ్యాపార సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గురించి మాట్లాడారు. కోట్ల రూపాయల డబ్బు వస్తున్నప్పటికీ వాటిని పక్కన బెట్టడం వెనుక బలమైన కారణం ఉందన్నారు. '20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో ఎన్ని సినిమాలు చేశాం. ఎన్ని బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నాం అనేదానిపైనే సక్సెస్‌ని నిర్ణయించేవారు. నిజానికి ఆ సమయంలో ఎన్నో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ ఇప్పుడు నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు పెద్దగా ఆలోచించకుండా కొన్ని బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడినా ఏడాది కాలంలో 15 బ్రాండ్లు వదులుకున్నా. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ నేను అంగీకరించడం లేదు. నాకు తెలిసిన వైద్యులను సంప్రదించి సదరు బ్రాండ్లతో ఎలాంటి హానీ లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత తెలిపారు.

వినోదం పంచే పాంచ్‌మినార్



రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్‌ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప విజన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పాడు. రామ్ కడుముల మాట్లాడుతూ 'పాంచ్‌మినార్ అంటే ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఆద్యంతం హాయిగా నవ్వుకునే సినిమా ఇది' అని తెలిపారు. 'ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది, ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక రాశీ సింగ్ చెప్పారు.

మంచి కథను అందించాలనే..

సుమయ రెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఆసక్తి. ఇంట్లో ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలే చూసేవాళ్లం. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మోడలింగ్ చేశా. సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. అందుకని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను' అని అన్నారు సుమయ రెడ్డి. ఆమె నిర్మిస్తూ కథానాయికగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'ఓ మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో 'డియర్ ఉమ' కథ రాశాను. దర్శకుడు సాయి రాజేశ్ మహదేవ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల పరిచయం ఉంది. అర్థవంతమైన కథ అందరికీ పనికొస్తుంది అన్నారు. నన్ను నమ్మి డబ్బులు పెట్టి సినిమా తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు అనే సంశయంలో పడిపోయా. అప్పుడు మా అమ్మ సపోర్ట్‌తో నేనే నిర్మాతగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. నేడు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సొసైటీకి మెసేజ్ ఇవ్వడమే కాదు పరిష్కారాన్నీ చూపించే ప్రయత్నం చేశాం. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఈ సినిమాలో మంచి లవ్ ట్రాక్ కూడా ఉంది. హీరో, హీరోయిన్లు ఒకరి లక్ష్య సాధనకు మరొకరు ఎలా సాయపడ్డారనే అంశాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. వీరిద్దరూ కలసి వైద్య వ్యవస్థ ప్రక్షాళనకు ఎలా పోరాడారన్నది ప్రధాన ఇతివృత్తం. ఒక తెలుగమ్మాయిగా నా సినిమాలో తెలుగు హీరోనే పెట్టాలనుకున్నాను. కొంతమందిని సంప్రదించాను కానీ డేట్స్ కుదరలేదు. అందుకని హీరోగా పృథ్వీ అంబర్‌ను ఎంచుకున్నాం' అని అన్నారు.






పెద్ద విజయం అందుకోబోతున్నాం

'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో చక్కని ఆదరణ దక్కుతోంది. అన్ని చోట్లా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇది ఇక్కడితో ఆగదు. సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతోంది' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. అజిత్ కుమార్ హీరోగా అదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అదిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ 'మైత్రీ సంస్థ తమిళంలో చేసిన తొలి చిత్రమిది. నవీన్ గారి వల్లే సినిమా ఇంత పెద్దహిట్ అయింది. అజిత్ గారి మద్దతు మరువలేనిది' అని చెప్పారు. అజిత్‌ఫ్యాన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని సునీల్ చెప్పారు. ఈ సినిమాలో నా పాత్రకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అని ప్రియా ప్రకాశ్ వారియర్ తెలిపారు.

భావోద్వేగానికి గురైన మంచు లక్ష్మి



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించే లక్ష్యంతో నటి మంచు లక్ష్మి 'టీచ్ ఫర్ ఛేంజ్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ ఏడాదీ హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా, నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంచు మనోజ్, తన సతీమణి మౌనికతో విచ్చేసి మంచు లక్ష్మీని ఆశ్చర్యపరిచారు. చాలా రోజుల తర్వాత తన తమ్ముడిని చూసిన ఆనందంలో ఆమె, భావోద్వేగంతో మనోజ్‌ను హత్తుకున్నారు. కంటనీరు పెట్టుకున్న మంచు లక్ష్మిని మౌనిక ఓదార్చారు.

బడ్జెట్‌లోని రూ.5కోట్లు వెంటనే విడుదల చేయాలి


మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లి(కొలనుకొండ), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో త్రిఫ్ట్ ఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తాడేపల్లి మండలం కొలనుకొండలోని జయభేరి అపార్టుమెంట్స్‌లో మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, కార్యదర్శి దోకిపర్తి రామారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుదిశ్వాస వరకూ సేవానిరతితో గడిపిన వెంకటసుబ్బారావు

● ఆఖరికోరికగా వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

దుగ్గిరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకూ సామాజిక సేవా కార్యక్రమాలతో గడిపిన జిల్లాఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లిపర వెంకటసుబ్బారావు(81) ఆదివారం హఠాన్మరణం చెందారు. కొద్ది రోజుల క్రితం వరకూ పూర్తి ఆరోగ్యంతో జీవించిన సుబ్బారావు మృతదేహాన్ని తన ఆఖరి కోరికగా మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారు. తననేత్రాలను శంకరకంటి ఆస్పత్రికి, పార్థివ దేహాన్ని మంగళగిరి ఎన్నారై కళాశాలకు అప్పగించాలని కోరి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలోని పలకలూరు రోడ్డులో ఉన్న జేఎల్‌ఈ సినిమా హాల్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకుమాను సందీప్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురంనకు చెందిన కాకుమాను సందీప్ హోండా యాక్టివా బైకుపై గుంటూరు వస్తున్నాడు. అయితే అదే సమయంలో గుంటూరు నుంచి పలకలూరు వైపు వెళుతున్న ట్రాలీ ఆటో జేఎల్‌ఈ సినిమా హాల్ వద్ద ఎదురుగా వెళుతున్న ఆటోను ఢీ కొట్టి అదుపు తప్పి ఎదురుగా వస్తోన్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఫిరంగిపురం నుంచి స్కూటీపై గుంటూరు వస్తోన్న సందీప్‌ను ఢీ కొట్టడంతో వాహనంపై ఉన్న సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. సందీప్ నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో గల ప్రముఖ కార్పొరేట్ కాలేజీలో ఆయన వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన పలకలూరుకు చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థిని మృతి

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని టిడ్కో గృహాల్లో ఉంటున్న షేక్ నగ్మా (17) అనే బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండ్రి రహంతుల్లా కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. తల్లి ఇళ్ళల్లో పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వారిలో పెద్ద కుమార్తె నగ్మా ఇంటర్ పరీక్షలు రాసింది. ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో ఆమెకు 780 మార్కులు వచ్చాయి. అయితే ఆమె మూడేళ్లుగా మైగ్రేన్‌తో బాధపడుతోంది. ఇదిలా ఉంటే భార్య, భర్తలు, తమ వెంట చిన్న కుమార్తెను తీసుకుని పనికి వెళ్లారు. అయితే ఇంతలో ఏం జరిగిందో గానీ తల్లిదండ్రులు వచ్చేసరికే ఆమె ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందకు దించి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ వికృత చర్యలతో ఆర్థిక విధ్వంసం

● సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వంలో అనాలోచిత నిర్ణయాలు, వికృత చర్యలతో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ అన్నారు. అమరావతే లక్ష్యంగా జగన్ ఆర్థిక విధ్వంసానికి పాల్పడడంతో రాష్ట్రంలో లక్షలాదిగా నిర్మించిన గృహ, భవన, దుకాణ సముదాయాలు నిరుపయోగంగా మారి అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. మంగళగిరి మండలం చినాకాకాని గ్రామంలో జరుగుతునన్న సీపీఐ జన సేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను ఆదివారం ఆయన సందర్శించారు. శిబిరంలో యువకుల విన్యాసాలను ఆయన తిలకించారు.

లోకేశ్ చొరవతో ప్రజలందరికీ మేలు : మంత్రి అనగాని


ఇళ్ల పట్టాల పంపిణీలో ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

మంగళగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అభివృద్ధి కోసం మంత్రి నారా లోకేశ్ తీసుకువస్తున్న జీవోలు రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేస్తాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబరు 24న రెగ్యులైజేషన్ ప్రతిపాదనను తీసుకువచ్చారని, లోకేశ్ కృషి, పట్టుదల కారణంగానే జీవో నెం.30 వచ్చిందని తెలిపారు. ఎలాంటి ఫీజులు లేకుండా మంగళగిరిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారన్నారు. ఈ జీవో రాష్ట్ర ప్రజలందరికీ ఉపయోపడుతుందన్నారు. లోకేశ్ వంటి నాయకుడు ఎమ్మెల్యే కావడం మంగళగిరి ప్రజల అదృష్టమన్నారు. మంగళగిరిలో అధిక శాతం పేదలే ఉన్నారని, వారి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. కుప్పంతో పోటీపడి మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నారన్నారు. మరో నాలుగు దఫాలు మంగళగిరి ఎమ్మెల్యేగా లోకేశే ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించడానికే ప్రభుత్వం పీ-4ని తీసుకువచ్చిందని మంత్రి చెప్పారు.

టిడ్కో వాసులకు అందుబాటులో మినరల్ వాటర్

ఆర్వో ప్లాంటును ప్రారంభించిన లోకేశ్


ఆర్వో ప్లాంటను ప్రారంభించి వాటర్ క్యాన్లను మహిళలకు అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలోని టిడ్కో కాలనీలో దివీస్ లేబొరేటరీస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంటును మంత్రి నారా లోకేశ్ ఆదివారం ప్రారంభించారు. తొలుత టిడ్కో కాలనీ వాసులు, కూటమి నేతలు మంత్రి లోకేశ్ కు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంటును లాంచనంగా ప్రారంభించారు. వాటర్ క్యాన్లను మంచినీటితో నింపి మహిళలకు అందజేశారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా దివీస్ లేబొరేటరీస్ సంస్థ రూ.3 కోట్ల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన 19 ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో దివీస్ సంస్థ సీఎస్ఆర్ హెడ్ జీ.నగేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేశరాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు

● డిప్యూటి పోలీస్ కమిషనర్ కేజీవీ సరిత


మాట్లాడుతున్న డిప్యూటి పోలీస్ కమిషనర్ కేజీవీ సరిత

తాడేపల్లి(వడ్డేశ్వరం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫెమ్ ఫ్లేర్ 2025పేరుతో మహిళా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా డిప్యూటి పోలీస్ కమిషనర్ కేజీవీ సరిత, గౌరవ అతిథులుగా క్రియేటివిటి, కల్చరల్ రాష్ట్ర చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, రాష్ట్ర అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎల్ఎస్ ఎం రమాశ్రీ, నారీశక్తి అవార్డు గ్రహీత రాధాదేవిలతో పాటు పలువురు గౌరవ అతిథులుగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ సరిత మాట్లాడుతూ విజన్ 2047 మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. కేఎల్‌యూలో నారీ శక్తి అద్భుతంగా ఉందన్నారు. విద్యావంతులైన మహిళలు ఆర్థికంగా సామాజికంగా పురుషులతో పోటీపడుతూ అభివృద్ధిలో ముందంజలో ఉంటూ దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదుల్లా ఉపయోగపడుతున్నారని, అంటువంటి మహిళలే దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఫెమ్ ఫ్లేర్ చైర్‌పర్సన్ రూత్‌రమ్య, కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ ప్రసంగించారు.

మే 4న శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ

దుగ్గిరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్క రించారు. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమ వివరాలను ఆలయ ఈవో కోగంటి సునీల్ తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్, వ్యవస్థాపక, ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, అర్చకులు తారక్‌నాథ్‌శర్మ, ఇంకొల్లు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కర్రసాము పోటీలు

పెదనందిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివలస ఛీఫ్ కోచ్ మరియు అధ్యక్షుడు సీహెచ్ రాము సహకారంతో జిల్లాస్థాయి కర్రసాము పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ గురువు మామిళ్లపల్లి రమేష్ ప్రారంభించారు. జిల్లా నలమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. 20 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

దుగ్గిరాల, ఏప్రిల్ 13: దుగ్గిరాలలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ఆవరణలో దుగ్గిరాల క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్రప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు ప్రారంభించారు. ఏటా వేసవిలో నిర్వహించే క్రికెట్ పోటీల్లో భాగంగా, ఆదివారం ప్రారంభమైన ప్రీమియర్‌లీగ్‌లో మండ లపరిసర గ్రామాలకు చెందిన 20 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పేదల ఇళ్ల పట్టాల కల నెరవేర్చిన ఘనత ఐటీ, విద్యాశాఖ మంతి నారా లోకేశ్‌కే దక్కుతుందని నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇట్టా భాస్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీతానగరం పీహెచ్‌సీ ఎదురుగా పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇట్టా భాస్కర్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పోతాబత్తిన శ్రీనివాసరావు, సాంబశివరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి: ములకా

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జొన్న, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించి రైతులకు గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం తెనాలి ప్రాంతంలో కురిసిన వడగండ్ల వానతో పలు ప్రాంతాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు నీటికి తడిసి నల్లకాటుక వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి తడిచిన గింజలను నాణ్యత ప్రమాణాలతో సంబంధం లేకుండా కొనుగోలుచేయాలని డిమాండ్ చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కరణం ధర్మారావు మృతి బాధాకరం

● ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి మనిషిగా పేరు పొందిన టీడీపీ సీనియర్ నాయకుడు హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు తండ్రి దివంగత కరణం ధర్మారావు మృతి బాధాకరమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ధర్మారావు ఆదివారం స్వగ్రామమైన కఠెవరంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నేటినుంచి అగ్నిమాపక వారోత్సవాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు ఆదివారం కోరారు. ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు పొన్నూరు పట్టణ, మండలంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, నివాస గృహాల వద్ద నిర్వహించే ఈ అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని అగ్నిప్రమాదాల నివారణకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

చావాలమ్మ దేవాలయంలో చోరీ

పెదకాకాని, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం అనుమర్లపూడిలోని చావాలమ్మ తల్లి దేవాలయంలో గత రాత్రి చోరీ జరిగినట్లు పెదకాకాని పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం అనుమర్లపూడిలోని చావాలమ్మ తల్లి ఆలయంలో పూజలు ముగిసిన తర్వాత ఆలయ పూజారి రాంబాబు దేవస్థానానికి తాళం వేసుకొని వెళ్లారు. మరుసటి రోజు ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వచ్చే సమయానికి చోరీ జరిగినట్లు గమనించారు. దేవస్థానం తాళాలు పగలగొట్టి ఆలయంలోని అమ్మవారి మంగళ సూత్రాలు, గొలుసులు, పలు వస్తువులను చోరీ చేశారు. సమాచారం అందుకున్న పెదకాకాని పోలీసులు క్లూస్ టీం పిలిపించి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఆలయ పూజారి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

భారతదేశం సనాతన సంప్రదాయాలకు పుట్టినిల్లు

● డాక్టర్ వెంకటేశ్వర యోగి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సనాతన సంప్రదాయాలకు పుట్టినిల్లని, భారతీయ సంస్కృతి ప్రకృతిని ఆరాధించి, సమాజాన్ని ప్రకృతితో మమేకం చేసిందని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర యోగి గురూజీ అన్నారు. ఆదివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలోని గోవులను సందర్శించి ఆవులకు పసుగ్రాసం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు విశ్వానికి తల్లి అని గోవును పూజించటం ప్రాచీన కాలపు సంప్రదాయమని అన్నారు. గోమాతను ఆరాధించడం, సంరక్షించడం మానవజాతికి మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, యోగా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, కూటమి పార్టీల నాయకులు

అంబేద్కర్ ఆశయాలు అనుసరణీయం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు అనుసరణీయమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్రకుమార్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంతో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నేటికీ కొనసాగుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ సమానత్వం అందించేందుకు ఆయన రూపొందించిన రిజర్వేషన్ల ప్రక్రియతో బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి అంబేద్కర్ ఆశయాలను కొనసాగించారన్నారు. భారతరత్న అవార్డు అంబేద్కర్‌కు రావడానికి తెలుగుదేశం పార్టీ ప్రధానభూమిక పోషించిందన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కూటమి పార్టీల నాయకులు, జైభీమ్ సమూహం నిర్వాహకులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యువత సామాజిక బాధ్యతతో మెలగాలి

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): యువత సామాజిక బాధ్యతతో మెలుగుతూ తోటివారికి సాయమందించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని 18వ వార్డు టీడీపీ కార్యాలయం సమీపంలో జనసేన అధ్వర్యంలో ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాదాచారులకు తాగునీరు, 1000లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వీవర్స్ కాలనీలో జనసైనికుల ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి పేదలకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, దేశం శక్తి సూర్య తాళ్లూరి అప్పారావు, తదితరులతో పాటు టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పేదలకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

విద్యార్థులకు అభినందన

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆకాంక్షలను అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని, వివేకా జూనియర్ కళాశాలలో ఆదివారం విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇంటా బయట ఎదురైన సమస్యలను ముందుగా తల్లిదండ్రులకు తరువాత గురువులకు నిర్భయంగా తెలియజేయాలన్నారు. సెల్‌ఫోన్ల వినియోగంపై తల్లిదండ్రులు కూడా దృష్టిపెట్టాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత విద్యకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారన్నారు. గ్రామీణ నేపథ్యంలో ఏర్పాటుచేసిన వివేకా జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి ఉత్తమ బోధన అందించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు గుంత గుర్తించేందుకు ఏర్పాటుచేసిన ఎర్ర వస్త్రం

రోడ్డు మధ్యలో గుంత

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత కారణంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వహాబ్ రోడ్డు నుంచి ఉప్పు బజారుకు వెళ్లే రహదారి కల్వర్టుపై వేసిన మ్యాన్ హోల్ మూత పగిలిపోయింది. దీనిని మునిసిపల్ అధికారులు గుర్తించి వెంటనే చర్యలు తీసుకోకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు గుర్తించేందుకు ఎర్రవస్త్రం ఏర్పాటు చేసి, దానిపై చెక్కను కొద్దిగా మూసి ఉంచారు. సమస్యలపై మునిసిపల్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా రథోత్సవం

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభరావుపాలెంలోని గంగా శ్యామలాంబ సమేత ఓంకారేశ్వర స్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి కల్యాణ పూజలందుకున్న గంగా శ్యామలాంబ సమేత ఓంకారేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథవాహనంపై ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వనుల నడుమ గ్రామ వీధుల్లో స్వామి వారి రథోత్సవం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ రథోత్సవంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రథంపై ఊరేగుతున్న శ్రీఓంకారేశ్వరస్వామి


పూలతో అలంకరించిన మట్టలతో ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆదివారం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చినరావూరు, ఐతానగర్, ప్యాడిసన్‌పేట తదితర ప్రాంతాల్లో ఈత మట్టలకు పూలు అలంకరించి క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు చేశారు. ఐతానగర్ సాల్వేషన్ ఆర్మీ చర్చిలో గేరా థామస్, సీయోను కుమారి, నాగరాజు, రత్నరాజు సందేశం ఇచ్చారు. బోసురోడ్డులోని టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులతో గాంధీచౌక్, శివాజీ చౌక్, కళాక్షేత్రం రహదారులలో ఊరేగింపు నిర్వహించారు.


ఘర్షణ జరగకుండా పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఆర్యవైశ్య సమావేశంలో కేకలు... తోపులాట

● ఇరువర్గాలకు సర్ధిచెప్పిన పోలీసులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం జనరల్ బాడీ సమావేశాన్ని ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటుచేసింది. అజెండాలో నూతన కమిటీ ఎన్నిక ఉండటంతో ఇప్పటికే రెండు వర్గాలుగా మారిన ఆర్యవైశ్యులు సమావేశానికి భారీగా తరలివచ్చారు. రెండు వర్గాల్లో బయటి వ్యక్తులు ప్రవేశించడంతో గందరగోళానికి దారి తీసింది. అరుపులు, కేకలతో ఒక వర్గంపై మరొక వర్గం వాదులాడుకున్నారు. ఒక దశలో వాదులాట తోపులాటకు దారి తీయడంతో అప్పటికే మోహరించిన పోలీసులు రెండు వర్గాలకు సర్ధి చెప్పారు. మరింత ఉద్రిక్త పరిస్థితికి దారి తీయకుండా ఆవరణలోకి వచ్చిన వారందరిని బయటకు పంపారు. ఒక వర్గం రిజిస్టర్ సంతకాలు చేసి కోరం పూర్తయ్యిందని, సమావేశం, ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టడం, బయటి వ్యక్తులు ఉండటం ఘర్షణకు దారితీసింది. గత ప్రభుత్వ పాలనలో ఆర్యవైశ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. బోసురోడ్డులోని వాసవీ ఆలయ ప్రాంగణం ఆగ్నేయం వైపున ఉన్న కాంప్లెక్స్ అన్నదాన సత్రానికి ఆస్తిగా ఉందని, దీనిని గత ప్రభుత్వ హయాంలో కూలగొట్టారని ప్రశ్నించిన తమపై దౌర్జన్యం చేశారని ఒకవర్గం చెబుతోంది. తమ ప్రభుత్వం రావడంతో ఆలయ కమిటీ ఎన్నికలో కూడా విజయం సాధించాలని ఒక వర్గం, పాలన తమ చేతుల్లోనే ఉండాలని ప్రస్తుత వర్గం ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నారు. డీఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో పోలీసులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పరిస్థితిని జిల్లా ఎస్పీకి వివరించి పోలీసు పర్యవేక్షణలో సమావేశాన్ని మంగళవారం సజావుగా జరిపిస్తామని ప్రకటించారు.


సమావేశానికి వచ్చిన ఆర్యవైశ్యులు


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న మురళి

జాతీయ తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు తెనాలి క్రీడాకారులు ఎంపికయ్యారని తైక్వాండో కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన తైక్వాండో పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం నిర్వహించిన సమావేశంలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అభినందించారు. ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్, మినీ సబ్ జూనియర్ పోటీల్లో ఎంపిక అయిన క్రీడాకారులను పరిచయం చేశారు. జ్ఞానతేజ, సనా, ఫాతిమా, అభిరామ్, కౌషిక్, జ్యోతేంద్ర, సోమశేఖర్, తేజశ్రీ, శ్రీజ, ఖుషిక, కృతిక ఎంపికయ్యారు. మే నెలలో ఉత్తరాఖండ్‌లో జరగనున్న పోటీలకు భువశ్రీ, హారికవర్మ, సాయిదీక్షిత, జశ్వంత్, చరణ్, అభిరామ్‌లు ఎంపిక కాగా వారిని అభినందించారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు శ్రీను, రమణ తదితరులు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చలివేంద్రంలో శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు చల్లని మజ్జిగను పాదచాలరులకు పంపిణీ చేశారు. ఆదివారం శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృందం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో వీఆర్ కన్సల్టేషన్ డైరెక్టర్ పెసర్లంక రమణ, శేఖర్ సహకారంతో 600మంది పాదచారులు, ప్రయాణికులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎస్ భక్తబృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో సభ్యులు మల్లెబోయిన బాబ్జి, అక్కల రమేష్, యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోసురోడ్డులో...


తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రోటరీ క్లబ్ కార్యదర్శి మురళీకృష్ణ, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, మండు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఏటా వేసవిలో సంస్థ సభ్యులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించారు. కార్యక్రమంలో మొవ్వా సత్యనారాయణ, ఆంజనేయులు, ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళి, నారాయణ, రజాక్, కుర్రా శ్రీనివాసరావు, కొత్తగొర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, వంగవీటి రాధా, కిలారి రోశయ్య తదితరులు

అందరి మనిషి వంగవీటి మోహనరంగ

● కఠెవరంలో రంగా విగ్రహావిష్కరణ సభలో రాధా

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి కోసం పాటుబడిన మనిషి దివంగత వంగవీటి మోహనరంగా అని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అన్నారు. ఆదివారం మండలంలోని కఠెవరంలో రాధారంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వంగవీటి రాధా మాట్లాడుతూ అనునిత్యం బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుబడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజల కోసం రంగా అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమావేశం

కొల్లిపర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నలభై ఎనిమిది సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆనాటి స్నేహితుల పలకరింపులు, ఆప్యాయతలతో ఆ పాఠశాల ప్రాంగణం మారుమోగింది. ఆదివారం మండల పరిధిలోని వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1976-77 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకుని వివిధ ఉద్యోగ, వృత్తులలో స్థిరపడిన సుమారు 40మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో పాఠశాలకు చేరుకుని ఆటపాటలతో, చిన్ననాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకుని ఎంతో ఆహ్లాదంగా గడిపారు. పూర్వ విద్యార్థి అన్నపరెడ్డి కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనాడు చదువుచెప్పిన పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలోకి వెళ్ళినప్పుడు ఆ గురువు పొందె ఆనందానికి అవధులు ఉండవన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత నివ్వాలని సూచించారు. తొలుత దివంగతులైన పూర్వ ఉపాధ్యాయులను, విద్యార్థులను స్మరించుకుని నివాళులర్పించారు. పూర్వ ఉపాధ్యాయులైన లంకిరెడ్డి శివన్నారాయణ, సిహెచ్ రామనాథ శర్మ, జి. కోటయ్య, పెండెల కృష్ణారావు, పిచ్చియ్యశాస్త్రిలను పూర్వ విద్యార్థులు మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ భీమవరపు రామకృష్ణారెడ్డి, కలకోటి శ్రీనివాసరెడ్డి, వంగా శేషిరెడ్డి, భీమిరెడ్డి శేషిరెడ్డి, లంకిరెడ్డి సత్యవతి, అచ్యుత సాంబశివరావు, నున్నా సుజాత, మేదరమెట్ల అంజన సారధ్యం వహించారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): శ్రీచెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. మండల పరిధిలోని ములకుదురులో ని శ్రీభూనీలసమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ వేడుకల్లో భక్త దంపతులు పాల్గొని వసంతోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ మూర్తులను పవళింపు సేవలకు తరలించారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కొల్లిపర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం కమిటీ సభ్యులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో అవుతు రత్నకుమారి 470మార్కులకుగాను 460 మార్కులు, బైపీసీలో గుదిబండి బసవసింధు 440 మార్కులుగాను 420 మార్కులు, రెండో సంవత్సరం ఇంటర్మీయట్‌లో కొల్లి దీపిక ఎంపీసీలో 1000 మార్కులకు గాను 933 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు కళాశాల కమిటీ సభ్యులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఎన్ఆర్ఐ గాదె రవీంద్రరెడ్డి రూ.5వేలు, గుదిబండి శ్రీనివాసరెడ్డి రూ.5వేలు, బొమ్మారెడ్డి మురళీమోహన్‌రెడ్డి రూ.5వేలు ఇచ్చారు. అనంతరం కళాశాల కమిటీ సభ్యులు విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వింతా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఏఆర్ఆర్ కళాశాల కమిటీ సభ్యులు

అధ్యక్షుడు ట్రంప్ చర్యలతో అమెరికాలో ఉద్రిక్తతలు

● ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న చర్యలు అమెరికాలో ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ విమర్శించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఇస్కఫ్ మహాసభ ఆదివారం తెనాలిలో నిర్వహించారు. సభకు హాజరైన వారితో మాట్లాడుతూ, రాజకీయాలతో సంబంధం లేకుండా అమెరికాలోని అన్ని రాష్ట్రాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు చేశారని చెప్పారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా అక్కడ ప్రజలే వీధుల్లోకి రావడం మార్పు తెస్తోందన్నారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో గోలి సీతారామయ్య, శ్రీదేవి, నాగమణి తదితరులు ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొల్లిముంత కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నిర్మల, ఉపాధ్యక్షుడిగా అబ్రహం లింకన్, శ్రీదేవి, శ్రీనివాసరావు, సహ కార్యదర్శులుగా నారాయణరావు, కాలేషా, కోశాధికారిగా రంగిశెట్టి రమేష్‌లు ఎన్నికయ్యారు. సభ్యులను ఎన్నుకున్నారు.


సభలో మాట్లాడుతున్న రాజశేఖర్